క్లుప్తంగా

వాటర్‌ట్యాంకు శుభ్రం


శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

నెన్నెల: మండల కేంద్రం లోని దుబ్బగూడెం మిషన్ భగీరథ వాటర్‌ట్యాంకును పంచాయతీ కార్యదర్శి సాగర్, మిషన్ భగీరథ సిబ్బంది శుభ్రం చేయించారు. ట్యాంకులో ఉన్న చెత్తాచెదారంతో పాటు బురదను తొలగించి బ్లీచింగ్ పౌడర్‌తో శుభ్రం చేయించారు. 'మురికిగా భగీరథ నీరు' శీర్షికన మంగళవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పంచాయతీ, భగీరథ సిబ్బంది వెళ్లి మట్టి, చెత్తను తొలగించి శుభ్రం చేశారు. త్వరలోనే లీకేజీలకు మరమ్మతు చేపడతామని, ఇక నుంచి భగీరథ నల్లాల ద్వారా అందించే శుభ్రమైన నీటిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలి

మంచిర్యాలఅర్బన్: కేజీబీవీ ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం మంచిర్యాల డీఈవో కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. తాండూర్ కేజీబీవీలో విధులు నిర్వర్తిస్తున్న నాన్‌టీచింగ్ వర్కర్లను రెండు సంవత్సరాలుగా వేధింపులకు గురిచేస్తూ ఇబ్బంది పెడుతున్నారని ఆరోపించారు. విచారణ చేపట్టి ఎస్‌వోపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజు, సుమలత, వర్కర్లు శ్రీలత పాల్గొన్నారు.

'సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలం'

మంచిర్యాలఅర్బన్: విద్యారంగ సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ సందీప్ అన్నారు. జిల్లా కేంద్రంలో బుధవారం ఏబీవీపీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి టికెట్ల పంపకాలపై ఉన్న శ్రద్ధ, విద్యారంగ సమస్యలపై లేదన్నారు. ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయటంలో నిర్లక్ష్యం వహించటాన్ని తప్పుబట్టారు. సమావేశంలో నాయకులు అరవింద్, అజయ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి


సమస్యలు తెలుసుకుంటున్న సురేఖ

మంచిర్యాలటౌన్: పట్టణంలోని ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ అన్నారు. జిల్లా కేంద్రంలోని 10వ వార్డు శ్రీనివాసకాలనీలో గడపగడపకూ వెళ్లి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు చేస్తున్న సేవా కార్యక్రమాలను ప్రజలకు వివరించారు.

తాండూర్ తహసీల్దార్‌గా రోహిత్



తాండూర్: మండల తహసీల్దార్‌గా రోహిత్ బుధవారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల నేపథ్యంలో కలెక్టరేట్‌లో విధులు నిర్వర్తిస్తున్న రోహిత్‌ను తాండూర్ మండలానికి బదిలీ చేశారు. ఈ మేరకు ఆయన ఉద్యోగ బాధ్యతలను స్వీకరించారు. కొత్తగా విధుల్లో చేరిన తహసీల్దార్ రోహిత్‌కు ఉద్యోగులు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

'ముదిరాజ్‌లను విస్మరించిన బీఆర్‌ఎస్'


నినాదాలు చేస్తున్న సంఘం నాయకులు

పాతమంచిర్యాల: ఎమ్మెల్యే టికెట్ల కేటాయింపులలో ముదిరాజ్ సామాజికవర్గాన్ని బీఆర్‌ఎస్ విస్మరించిందని ముదిరాజ్ సంఘం జిల్లా అధ్యక్షుడు తూటి శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి, ఐబీ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం పట్టణ ఉపాధ్యక్షుడు శాతం మల్లేష్, గౌరవ అధ్యక్షుడు సారంగపాణి, ప్రధాన కార్యదర్శి జక్కుల రాజు, కార్యనిర్వాహక కార్యదర్శి మడిగెల సురేష్, ముదిరాజ్‌కుల సంఘం నాయకులు, మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు పాల్గొన్నారు.


జన్నారం: జాతీయ పతాకంతో విద్యార్థుల ర్యాలీ


చెన్నూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో..


సంబురాల్లో నాయకులు, కార్యకర్తలు

చంద్రయాన్-3 సక్సెస్‌పై హర్షం

- టపాసులు కాల్చి, మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు


భీమారంలో జాతీయ రహదారిపై సంబురాలు జరుపుకొంటున్న యువకులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): చంద్రయాన్-3 విజయవంతం కావడంపై అసెంబ్లీ ప్రవాస్, మహారాష్ట్ర ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయపవార్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి ఆధ్వర్యంలో బుధవారం హాజీపూర్ మండల కేంద్రంలో సంబురాలు జరిపారు. బాణాసంచా కాల్చి స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేసి నాయకులు, కార్యకర్తలు సైతం మిఠాయిలు తినిపించుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ... భారత శాస్త్రవేత్తల విశేష కృషితో చంద్రయాన్-3 విజయవంతమైందని, ఇది 140కోట్ల భారతీయ ప్రజల అద్భుత విజయమని అన్నారు. సంబురాల్లో బీజేపీ మండల అధ్యక్షుడు బొలిశెట్టి తిరుపతి, నాయకులు మల్లారెడ్డి, రజనీశ్‌జైన్, తిరుపతి, సిసోద్య, కృష్ణమూర్తి, సత్యం, నరేశ్, స్వామిరెడ్డి, నర్సయ్య, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

జన్నారం: చంద్రయాన్ సక్సెస్‌పై జన్నారంలో హర్షం వ్యక్తం చేశారు. స్థానిక రాఘవేంద్ర లిటిల్ హాస్స్ పాఠశాలలో చంద్రయాన్ సక్సెస్ తీరును విద్యార్థులకు బుధవారం ప్రొజెక్టర్ ద్వారా చూపించారు. అనంతరం జాతీయ పతాకంతో విద్యార్థులు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ చైర్మన్ ఎర్ర చంద్రశేఖర్, కరస్పాండెంట్ సంపత్, ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూర్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో క్రీడాకారులు చంద్రయాన్-3 విజయవంతం కావడంపై బాణాసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ వ్యాయామ ఉపాధ్యాయులు రామయ్య, సీనియర్ క్రీడాకారులు సంతోశ్ పాల్గొన్నారు.

జైపూర్: మండలంలోని వేలాల గ్రామంలో బుధవారం చంద్రయాన్-3 విజయవంతంగా సేఫ్ ల్యాండింగ్ అయిన సందర్భంగా సంబురాలు జరుపుకున్నారు. సర్పంచ్ ప్యాగ శ్యామల, ఉపసర్పంచ్ డేగ నగేశ్ ఆధ్వర్యంలో గ్రామంలో జాతీయ జెండాలతో ఇస్రోకు శుభాకాంక్షలు తెలిపారు.

భీమారం: చంద్రయాన్-3 విజయవంతం నేపథ్యంలో భీమారం మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై యువకులు టపాకాయలు కాల్చి సంబురాలు జరుపుకున్నారు. మండలంలోని బూర్గుపల్లి ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు ఫ్లకార్డులతో గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

కోదండ రామాలయంలో పూజలు

తాండూర్: మండలంలోని మాదారం టౌన్‌షిప్‌లోని శ్రీకోదండరామాలయంలో చంద్రయాన్-3 విక్రమ్ ల్యాండర్ విజయవంతం కావాలని కోరుతూ బుధవారం బీజేపీ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీజేపీ కర్ణాటక ఎమ్మెల్యే భాగీరథీ మురుల్యా, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి నాయకులు పాల్గొన్నారు.

సెలబ్రేషన్స్ ఆఫ్ చంద్రయాన్

చెన్నూర్‌రూరల్: కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం సెలబ్రేషన్స్ ఆఫ్ చంద్రయాన్ 3 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో చెన్నూర్ పట్టణానికి చెందిన సుమారు పది విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. చెన్నూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకుడు డి.సందీప్ చంద్రయాన్-3 పనితీరును, ఒక మోడల్‌ని తయారు చేసి దాని ఆధారంగా విద్యార్థులకు వివరించారు.

సమానపనికి సమాన వేతనం చెల్లించాలి


వినతిపత్రం ఇస్తున్న దాసు, ఉద్యోగులు

నస్పూర్: నేషనల్ హెల్త్ స్కీంలో పనిచేస్తున్న అన్ని క్యాడర్ల ఉద్యోగులకు, సమానపనికి సమాన వేతనం చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకలదాసు డిమాండ్ చేశారు. ఉద్యోగులతో కలిసి బుధవారం ఆయన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో సూపరింటెండెంట్ విశ్వేశ్వర్‌రెడ్డికి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. దాసు మాట్లాడుతూ.. అన్ని క్యాడర్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, జీఓ 51 ప్రకారం సమానపనికి సమాన వేతనం చెల్లించాలని, ఎన్‌హెచ్‌ఎం హెల్త్ కార్డులు, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరీ దేవనబోయిన బాపు, ఏఎన్‌ఎంలు రాజేశ్వరి, కళావతి తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక

జన్నారం: మండలంలోని కవ్వాల మాజీ ఉపసర్పంచ్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఫజల్‌ఖాన్ తన అనుచరులతో కలిసి బుధవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. పార్టీలో చేరిన అతడికి ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి జాన్సన్‌నాయక్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.



వాసవీమాతకు ప్రత్యేక పూజలు



భీమారం: మండల కేంద్రంలో ఆర్యవైశ్యసంఘం ద్వారా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బుధవారం శ్రీవాసవీమాతాకు 29రకాల పదార్థాలతో చేసిన వాటిని నైవేద్యంగా సమర్పించారు. కన్యాకాపరమేశ్వరి వాసవీపీఠం నుంచి తీసుకొచ్చిన వాసవీమాత విగ్రహానికి ఐదు రోజుల పాటు వివిధ రకాల పూజలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

బీజేపీలో చేరిక

మందమర్రిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ చెన్నూర్ నాయకులు ఆనంద్ బుధవారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనకు మాజీ ఎమ్మెల్యే సొత్కు సంజీవరావు బీజేపీ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీ గెలుపుకోసం కృషి చేస్తానని తెలిపారు.

'గృహలక్ష్మి' దరఖాస్తుల ఆన్‌లైన్ నమోదు

వేమనపల్లి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ లక్ష్మయ్య, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ గృహలక్ష్మి డాటా ఎంట్రీ వివరాలు నమోదు చేయించారు. అన్ని గ్రామపంచాయతీల వారు గృహలక్ష్మి దరఖాస్తులను సకాలంలో ఆన్‌లైన్‌లో పొందుపర్చాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు.

విశ్వరూప మహాసభ విజయవంతం చేయండి

మందమర్రిరూరల్: సెప్టెంబర్ మొదటివారంలో హైదరాబాద్‌లో నిర్వహించే విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్‌ఎస్‌ఎఫ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి చిప్పకుర్తి సతీష్ పిలుపునిచ్చారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో చెన్నూర్ ఇన్‌చార్జి విష్ణు, మందమర్రి ఇన్‌చార్జి జీడి సారంగం, సాంబయ్య, రవి, రాజ్‌కుమార్, సంజీవ్, మదన్, లక్ష్మణ్, శంకర్ తదితరులు ఉన్నారు.

'అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలి'


మాట్లాడుతున్న ఎమ్మెల్యే భాగీరథీ మురుల్యా

తాండూర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి రావడానికి ప్రతి కార్యకర్త చిత్తశుద్ధితో పని చేయాలని కర్ణాటక రాష్ట్ర సులియా ఎమ్మెల్యే భాగీరథీ మురుల్యా అన్నారు. ప్రవాస్‌యోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం తాండూర్ సురభి ఫంక్షన్ హాల్లో జరిగిన బీజేపీ శ్రేణుల సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని సూచించారు. ఎన్నికల్లో అనుసరించే విధానాలను వివరించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు మహీధర్ గౌడ్, మాజీ ఎమ్మెల్యే శ్రీదేవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొయ్యల ఏమాజీ, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, జిల్లా అధికార ప్రతినిధి కృష్ణ దేవరాయలు, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, నాయకులు శేషగిరి, రాజలింగు, వివిధ మోర్చాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పని చేసే వారికే పదవులు

వేమనపల్లి: కష్టపడి పనిచేసేవారికే బీజేపీలో పదవులు ఉంటాయని కర్ణాటక ఎమ్మెల్యే భాగీరథీ మురుల్యా అన్నారు. ప్రవాసయోజన కార్యక్రమంలో భాగంగా బుధవారం వేమనపల్లి మండల కేంద్రంలో బీజేపీ మండల అధ్యక్షుడు బైస మల్లేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బూత్ అధ్యక్షులను ఏర్పాటు చేసుకోవాలని, పార్టీ బలోపేతంగా ఉంటేనే విజయవకాశాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి సంతోష్, ఉపాధ్యక్షుడు రమేష్, భీమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మునిమంద రమేష్, నియోజకవర్గ నాయకుడు కొయ్యల ఏమాజీ, పట్టి వెంకటకృష్ణ, దుర్గం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే రాష్ట్రాభివృద్ధి'


మాట్లాడుతున్న అభిమన్యు దత్తాత్రేయ పవార్

లక్సెట్టిపేట: బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రాభివృద్ధి జరుగుతుందని మహారాష్ట్ర ఔసా ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయ పవార్ అన్నారు. సంపర్క్ సమర్థన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం పట్టణానికి విచ్చేసిన ఆయన పలువురు వ్యాపారవేత్తలతో మాట్లాడారు. రాష్ట్రం అభివృద్ధిలో వెనుకబడిపోయిందని, బీజేపీ అధికారంలోకి వస్తే చాలా అభివృద్ధి చేస్తుందన్నారు. బీజేపీ హయాంలో దేశం ప్రపంచ దేశాలతో పోటీపడి అభివృద్ధి చెందుతుందన్నారు. రాష్ట్రంలో త్వరలో జరగబోయే ఎన్నికల్లో బీజేపీకి ప్రజలు సహకారం అందించాలని, పార్టీ కోసం కృషి చేయాలన్నారు. అనంతరం పట్టణంలోని ప్రముఖ వ్యాపారవేత్త సుధాకర్, ఇతర వ్యాపారులు, ప్రజలతో మాట్లాడి లకావత్ రవీందర్ ఇంటిలో భోజనం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రఘునందన్, పట్టణాధ్యక్షుడు హరిగోపాల్, నాయకులు మల్లారెడ్డి, రజనీష్, మున్నారాజ సిసోడియా, ప్రభాకర్, వేముల మధు, అంజనేయులు, రమేష్ పాల్గొన్నారు.

మోదీ 9 ఏళ్ల పాలనపై వివరణ

మంచిర్యాలటౌన్: కేంద్రంలో నరేంద్రమోదీ ప్రభుత్వం పాలన చేపట్టి 9ఏళ్లు గడిచిన సందర్భంగా ఆయన సాధించిన విజయాలను జిల్లా కేంద్రంలో మార్వాడి యువమంచ్ కమిటీ సభ్యులకు మహారాష్ట్రకు చెందిన ఎమ్మెల్యే అభిమన్యు దత్తాత్రేయ పవార్ బుధవారం వివరించారు. సంపర్క్ సే సమర్థన్ కార్యక్రమంలో భాగంగా మార్వాడి యువమంచ్ సభ్యులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించి, దేశాభివృద్ధికి మోదీ తీసుకున్న నిర్ణయాలు, చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించి, మరోసారి వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి, నాయకులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం గఢ్‌పూర్, నాగారం గ్రామ పంచాయతీల్లో మంగళవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు ఉచిత నట్టల నివారణ, గాలికుంటు నివారణ టీకాలు వేశారు. 340ఆవులు, ఎడ్లు, 112గేదెలకు టీకాలు వేసినట్లు పశువైద్యాధికారిణి శాంతిరేఖ తెలిపారు. పశువైద్య సిబ్బంది అగ్నివేశ్, సికిందర్, నారాయణ, రమేశ్, పశు రైతులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ మల్లిఖార్జున్, రిటర్నింగ్ అధికారి దత్తు, ఎన్నికల డీటీ లక్ష్మీనారాయణ, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి


సివిల్ విభాగానికి వచ్చిన బహుమతిని ప్రదర్శిస్తున్న జీఎం

నస్పూర్: శ్రీరాంపూర్ ఏరియాలో పనిచేస్తున్న ప్రతీ ఉద్యోగి కార్మికులు స్వచ్ఛతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జీఎం సంజీవరెడ్డి తెలిపారు. నస్పూర్ కాలనీలోని సివిల్ కార్యాలయంలో బుధవారం స్వచ్ఛత పక్వాడా అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. సింగరేణి వ్యాప్తంగా స్వచ్ఛత పక్వాడా కార్యక్రమంలో భాగంగా 2023సంవత్సరానికి శ్రీరాంపూర్ ఏరియాకు మొదటి బహుమతి రావడం సంతోషకరమైన విషయం అని తెలిపారు. బహుమతి రావడానికి కృషి చేసిన అన్ని గనుల మేనేజర్లు, ప్రాజెక్టు ఆఫీసర్లు, ఏజెంట్లు, డిపార్ట్‌మెంట్లకు అభినందనలు తెలిపారు. శ్రీరాంపూర్ ఏరియాలో సివిల్ విభాగానికి రెండో బహుమతి రావడంపై వారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో ఇదే విధంగా కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో డీజీఎంలు సివిల్ శివరావు, ఆనంద్‌కుమార్, ఎస్ఈ సివిల్ రాములు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు సత్యనారాయణ, గుండెరావు, సివిల్ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్య సాధనపై సమీక్ష


మాట్లాడుతున్న రవికుమార్

మందమర్రిరూరల్: మందమర్రి ఏరియాలోని బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతపై ఏరియాలోని జీఎం ఆఫీస్ ఆవరణలోని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఏరియా జీఎం మనోహర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశానికి జీఎం, ఐఅండ్ పీఎం, ఆన్యువల్ ప్లానింగ్ కమిటీ అధ్యక్షుడు రవికుమార్ పలు సూచనలు చేశారు. ఏరియాలోని గనుల వారీగా ఉత్పత్తి ఉత్పాదకత లక్ష్య సాధనకు కావాల్సిన యంత్రాలు, వాటి విడి భాగాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఓపెన్ కాస్ట్ గనుల్లో హాల్ రోడ్డు వేయాలని తెలిపారు. సమావేశంలో ఎస్వోటు జీఎం రాజేశ్వరరెడ్డి, కేకే-ఓసీ, శాంతిఖని, రమేష్, విజయ్‌కుమార్, సివిల్ డిపార్ట్‌మెంట్ డీజీఎం శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

■ బొగ్గుబాయి వార్తలు

గైర్హాజరు ఉద్యోగులకు కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఏజెంట్ గోపాల్‌సింగ్

నస్పూర్: చిన్నచిన్న కారణాలతో ఉద్యోగులు తమ విధులకు గైర్హాజరు కావొద్దని ఎస్ఆర్‌పీ గ్రూప్ ఏజెంట్ గోపాల్‌సింగ్ తెలిపారు. ఎస్ఆర్‌పీ 3, 3ఏ గని కాన్ఫరెన్స్ హాల్లో బుధవారం గైర్హాజరు ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. డ్యూటీ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. వ్యక్తిగత అనారోగ్య సమస్యలు ఏమైనా ఉంటే, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. తరుచూ గైర్హాజరైతే కంపెనీ నియమ నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో డీవైజీఎం సంతోష్‌కుమార్, సంక్షేమ అధికారి గౌస్‌పాషా, ఫిట్ సెక్రటరీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం'

నస్పూర్: సింగరేణి సంస్థ ఉత్పత్తి ఉత్పాదకతో పాటు ఉద్యోగుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తుందని ఎస్ఆర్‌పీ ఏజెంట్ గోపాల్‌సింగ్ తెలిపారు. ఎస్ఆర్‌పీ 3, 3ఏ గనిపై మెడికల్ ఆఫీసర్ డాక్టర్ లోక్‌నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెడికల్ క్యాంపు కార్యక్రమంలో గోపాల్‌సింగ్ పాల్గొన్నారు. వైద్య సిబ్బంది ఉద్యోగులకు మధుమేహం, బీపీ రోగనిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రోగ నివారణకు పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ వైస్ ప్రెసిడెంట్ సురేందర్‌రెడ్డి, ఎస్ఆర్‌పీ 3, 3 ఏ డీవైజీఎం సంతోష్‌కుమార్, గని సంక్షేమాధికారి గౌస్‌పాషా, ఫిట్ సెక్రటరీ గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకపత్రాలు అందజేత


నియామకపత్రాలు పొందిన వారితో జీఎం

నస్పూర్: సింగరేణి సంస్థ కారుణ్య నియామకాలు చేపడుతూ దక్షిణభారత దేశానికే తలమానికంగా నిలిచిందని శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి తెలిపారు. జీఎం కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో జరిగిన కార్యక్రమంలో 43మంది యువతీ యువకులకు నియామకపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ.. నియామకపత్రాలు పొందిన యువతీ యువకులు విధులకు గైర్హాజరు కాకుండా క్రమశిక్షణతో ఉద్యోగం చేసుకోవాలని అన్నారు. ఉద్యోగంలో నైపుణ్యాన్ని పొంది, ఉన్నత స్థానాలు అధిరోహించాలని సూచించారు. ఇప్పటి వరకు శ్రీరాంపూర్ ఏరియాలో 3401మందికి, సింగరేణి వ్యాప్తంగా 11451మందికి కారుణ్య నియామకపత్రాలు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐకే ఓసీ ప్రాజెక్టు ఆఫీసర్ శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సీనియర్ పీఓ కాంతారావు, అధికారులు బాపయ్య, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు.. పనులు మరిచారు!



దండేపల్లి: మండలంలోని కాసిపేట ఎత్తిపోతల పథకం వరకు 1.2కిలోమీటర్ల మెటల్ రోడ్డు నిర్మాణానికి రూ.30లక్షల ఎఫ్‌డీఆర్ నిధులు మంజూరయ్యాయి. దీంతో కొద్దిరోజుల క్రితం రోడ్డు పనులు ప్రారంభానికి కొబ్బరికాయలు కొట్టారు. పనులు మాత్రం చేయడం లేదు. దీంతో పొలాలకు, ఎత్తిపోతల పథకానికి వెళ్లేందుకు రైతులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు పనులు ప్రారంభించాలని పలువురు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ రాజ్ ఏఈఈ తివారిని సంప్రదించగా నాలుగు నెలల క్రితమే అగ్రిమెంట్ అయ్యింది. ప్రస్తుతం వర్షకాలం కాబట్టి పనులు చేపట్టడం ఇబ్బంది అవుతుంది. వర్షకాలం అయ్యాక, పనులు చేపడతామన్నారు.